క్లుప్తంగా

అంబులెన్స్‌లోనే గర్భిణుల ప్రసవం

మాగనూర్: అంబులెన్స్‌లో వేరు వేరు సమయాల్లో ఇద్దరు మహిళలు ప్రసవించారు. మొదట కృష్ణ మండలం కూసుమూర్తి గ్రామానికి చెందిన భీమ్‌బాయ్ గర్భిణిని మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. అలాగే మాగనూర్ మండలం కోల్పూర్ గ్రామానిక చెందిన అశ్వినికు నెలలు నిండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

నేటి నుంచి మహబూబ్ సుహనీ ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో వెలసిన మహబుబ్ సుహనీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఊరేగింపుగా గంధోత్సవం, శనివారం కందూర్లు, భక్తుల మొక్కులు, ఆదివారం జారత నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నేడు మంత్రి వాకిటి పర్యటన

ఆత్మకూర్: రాష్ట్ర కీడ్రలు, యువజన, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి శనివారం ఆత్మకూర్‌లో పర్యటించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తులసీరాజ్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనులు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక నిమిత్తం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పలువురు నాయకులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని జొన రెచాల్ పైచదువుల నిమిత్తం శుక్రవారం దమగ్నాపురంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థిని జొన రెచాల్ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిన్నచింతకుంట గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రూప్–1 విజేతకు సన్మానం

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన మండ్ల కవిత గ్రూప్–1 ఫలితాల్లో ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈ క్రమంలో గురువారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మండ్ల కవితను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి చేరుకుని శానాయిపల్లి గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో తోకల బాల్‌రెడ్డి, పర్వతాలు, బాలస్వామి, రాము ఉన్నారు.

పీపీఎల్ విజేతగా రాజులెవెన్ జట్టు

పాన్‌గల్: విజయదశమి సందర్భంగా మండలకేంద్రంలో నిర్వహించిన పాన్‌గల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో రాజు లెవెన్‌జట్టు విజేతగా, ఫ్రెండ్స్ లెవెన్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విజేతలకు నరేందర్‌గౌడ్ రూ.10 వేలు నగదు అందజేసి అభినందించారు.

రహదారిని బాగు చేయాలి

వనపర్తి రూరల్: రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని కాశీంనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎర్రగట్టుతండా దారి మురుగు నీటితో నిండిపోయింది. దారిని బాగు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. మురుగు వల్ల దోమలు ప్రబలి అంటురోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



నారాయణపేటలో అమ్మవారి శోభయాత్ర



కోస్గిలో దహనమవుతున్న రావణుడి బొమ్మ



మరికల్‌లో రావణ దహనం

భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: విజయదశమి ముగింపు వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు జమ్మిచెట్టుకు పూజలు చేసి అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే పలుచోట్ల అమ్మవారి శోభయాత్ర కనులవిందుగా నిర్వహించారు.

- నారాయణపేటలో ప్రధాన రహదారి గుండా అమ్మవారి శోభయాత్ర నిర్వహించారు. కోలాటాలు, మంగళ హారతులతో పిల్లలు, యువతి, యువకులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని జల ప్రవేశం చేశారు.
- మద్దూరులో ఆనవాయితీ ప్రకారం మాజీ ఎంపీపీ బర్ల అంజయ్య కుటుంబసభ్యులు శమీ వృక్షానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పాండురంగ స్వామి దేవాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు జరిపించారు.
- కోస్గిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో భారీ రావణాసురుడి బొమ్మను దహనం చేశారు.
- నర్వలోని ఆయా గ్రామాల్లో పండగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన చీరల వేలంలో రూ.3.11 లక్షలకు సంఘం సభ్యులు పాటపాడి దక్కించుకున్నారు.
- మాగనూర్‌లోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వరుసగా రెండో సంవత్సరం రావణ దాహనం నిర్వహించారు. అంతకుముందు జమ్మీ చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.
- మరికల్‌లో ఏర్పాటు చేసిన 81 అడుగుల భారీ ధ్వజ స్తంభాన్ని పూజల అనంతరం ప్రారంభించారు. అలాగే రామ్‌లీల మైదానంలో రావణుడి బొమ్మను దహనం చేశారు.
- ధన్వాడలో ఆయుధాలతో గ్రామస్తులు ఊరేగింపుగా బయలుదేరి స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరుకొని జమ్మి చెట్టు వద్ద ఆయుధాలను పెట్టి ప్రత్యేక పూజలు జరిపించారు.
- కొత్తపల్లి, దామరగిద్దలో గ్రామ పరిసరాల్లోని దేవాలయాల ప్రాంగణంలో జమ్మి చెట్లకు ప్రత్యేక పూజలు చేసి ఆకులను తెంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



నారాయణపేటలో అమ్మవారి వేషధారణలో చిన్నారులు..



మరికల్‌లో అమ్మవారి నిమజ్జన వేడుకలు



దామరగిద్దలో తుల్జాపూర్ బయలుదేరిన భక్తులు



అమ్మవారి చీర దక్కించుకున్న దంపతులు



మద్దూరులో శివాలయం దగ్గర శమీ వృక్షానికి పూజలు నిర్వహిస్తున్న ప్రజలు



ధన్వాడలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



మాగనూర్‌లో రావణ దహనంలో భక్తులు, గ్రామస్తులు

మహాత్ముడి ఆశయాలు నెరవేరుద్దాం



మక్తల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి నెట్‌వర్క్: జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, అలాగే పార్టీల ఆధ్వర్యంలో గాంధీజి చిత్రపటానికి అధికారులు, నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనకు యువతీ యువకులు దేశసేవలో ముందుండాలని కోరారు.

- నారాయణపేటలోని మహాత్మా గాంధీ విగ్రహానికి మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి, టీపీసీసీ సభ్యులు చిట్టెం అభిజయ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే గాంధీనగర్‌లో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ పాల్గొని గాంధీజీకి ఘన నివాళి అర్పించారు.
- మరికల్‌లో వార్తక వాణిజ్య సంఘం, ఆర్యవైశ్య, అఖిలపక్షం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.
- మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరి గాంధీ విగ్రహానికి పూలమాలలతో నివాళి అర్పించి గాంధీజీ త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ



మరికల్‌లో గాంధీ జయంతి జరుపుకొంటున్న నాయకులు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మార్కెట్ చైర్మన్ శివారెడ్డి

డిప్యూటీ కలెక్టర్‌ను అభినందించిన నామాజీ

నారాయణపేట: జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాస్,వసుంధర దంపతుల కూతురు వీణ గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ దక్కడంతో శుక్రవారం మాజీ కౌన్సిలర్ సిద్ధి విశాలాక్షి నివాసంలో బీజేపీ నాయకులు అభినందించి శాలువాతో సన్మానించారు. బీజేపీ సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ శాలువా కప్పి సన్మానించి అభినందించారు. పేదలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుత సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి సిద్ధి వెంకట్ రాములు, డాక్టర్ అర్చన,సిద్ధి అభిరామ్, ఎస్.వినయ్, ఎస్.విద్యా తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్ వీణను అభినందిస్తున్న బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ

పొలంలోకి వరద.. దెబ్బతిన్న పంట

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత–కొత్తపల్లి మధ్యలో నిర్మించాల్సిన కల్వర్టు నిర్మించకపోవడంతో ఓ రైతు పొలంలో నీరు నిలిచి పంట నీట మునిగింది. మండలంలో రోడ్డు విస్తరణ చేపట్టడంతో వరద నిలవకుండా కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. అయితే నీరు నిలిచే చోట కల్వర్టు నిర్మించకపోవడంతో కొత్తపల్లి తండాకు చెందిన రామునాయక్ ఎకరా భూమిలో నీరు నిలిచి జొన్న పంట నీట మునిగింది. దీంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కల్వర్టు నిర్మించి నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారం చూపాలని బాధిత రైతు అధికారులను కోరుతున్నాడు.



చెరువును తలపిస్తున్న పంట పొలం

పోరాట ఫలితంగానే వేతనాల పెంపు

నారాయణపేట టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా నైబర్ హుడ్ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిటీ ప్రధాన కార్యదర్శి కాశప్ప మాట్లాడుతూ.. వేతనాల పెంపు హెచ్ఆర్ పాలసీ అమలు కోసం, రెగ్యులరైజ్ చేయాలని 2024 నుంచి ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో దశల వారిగా ఆందోళన, పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోరాటాల ఫలితంగానే ఎస్ఈఆర్‌పీలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచింది. కానీ ఎన్‌హెచ్‌సీలలో పనిచేస్తున్న సిబ్బందిని పట్టించుకోలేదు. ఎన్‌పీఆర్డీ, ఎన్‌హెచ్‌సీ యూనియాన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఇప్పుడు ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా సహాయ కార్యదర్శులు బాలరాజు, బస్వరాజ్, జిల్లా నాయకులు సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశప్ప

ఎన్నికలపై నేడు సమావేశం

కృష్ణా: మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో శనివారం మండల కేంద్రంలోని క్షీరాలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రధానంగా జెడ్పీటీసీకి పోటీ చేసే అభ్యర్థి ఎంపిక విషయంపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు విధిగా హాజరుకావాలని కోరారు.

కేవీపీఎస్ పోరాటాలతోనే పున్నయ్య కమిషన్ ఏర్పాటు

అమరచింత: కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనతోనే ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్సీ హౌసింగ్ బోర్డుకాలనీలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యాల సాధనకు సంఘం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో దళితులకు దళితబంధు ద్వారా ఏడాదికి రూ.12లక్షలు అందిస్తామన్న హామీని విస్మరించారన్నారు. రాబోయే రోజుల్లో దళితుల హక్కుల కోసం ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్, లక్ష్మణ్, రవి, సుజ్ఞనం, లక్ష్మయ్య, చిట్టెమ్మ, ప్రవీణ పాల్గొన్నారు.



కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్

నిరుపయోగంగా జైభీం పార్కు

అమరచింత: మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం– జై భీం పార్కులో మురుగు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన పార్కులో కనీస వసతులు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పూల, పండ్ల మొక్కలు, క్రీడలకు సంబంధించిన సామగ్రి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పాఠశాలకు విరాళం అందజేత



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాలకు గ్రామ వాసి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, పారిశ్రామిక వేత్త ఫీట్లకతాల్ రూ.50వేల విరాళాన్ని శుక్రవారం ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేసిన దాతకు ఉపాధ్యాయబృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం దిశగా అడుగులు



స్లాబు వరకు పూర్తి అయిన ఇందిరమ్మ ఇళ్లు

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- పైలెట్ ప్రాజెక్టుగా 'అడవిసత్యావార్' ఎంపిక

మాగనూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదవారి సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా రూ.5 లక్షలతో పేదవారికి ఇళ్లు మంజూరు చేస్తోంది. తమ సొంతింటి కల సాకారమవుతుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

28 మందికి ఇళ్ల మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని అడవిసత్యావార్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను ఎంపిక చేసి 28 ఇళ్లు మంజూరు చేసింది. పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం 21 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 15 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకున్నాయి. 3 రూఫ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. రెండు ఇళ్లు స్లాబ్ లెవల్ పూర్తి చేసుకున్నాయి. అలాగే ఇప్పటి వరకు 9 మందికి రూ.లక్ష చొప్పున మొదటి విడతల్లో నగదు జమ అయినట్లు అధికారులు వెల్లడించారు.



స్లాబ్ లెవల్ వరకు పూర్తి అయిన ఇందిరమ్మ ఇళ్లు

వేగంగా పనులు..

అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో ఇళ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్లు మొదలుకొని స్లాబు, గోడలు ఇలా గృహ ప్రవేశం లోపు లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తంగా రూ. 5 లక్షలు ప్రభుత్వం జమ చేయనుంది. నిర్దేశించిన ప్రకారమే నిర్మాణం చేపట్టాలని, నిబంధనలు పాటించకుండా చేపట్టే నిర్మాణాలకు నిధుల విడుదలలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అధికారుల సూచనల మేరకు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

గుడిసెలో ఉండేవాళ్లం..

మాకు ఇళ్లు లేక గుడిసెలో ఉండేవాళ్లం. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇల్లు మంజూరు కావడంతో సంతోషంగా ఉంది. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. బేస్‌మెంట్ వరకు పూర్తి కావడంతో పంచాయతీ కార్యదర్శి వచ్చి ఫోటోలు తీసుకున్నాడు. రూ. లక్ష నగదు కూడా ఖాతాలో జమైంది.

–రాజేశ్వరి, అడవిసత్యావార్ గ్రామం

మంత్రికి రుణపడి ఉంటాం..

ఏళ్లగా ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందులోనూ మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో తమ గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి పేదలకు ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. పేదల సొంతింటి కల నేరవేరుస్తున్నందుకు మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

–శివరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆన్‌లైన్‌లో నమోదు..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అడవిసత్యావార్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేశాం. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం నిర్మించి అధికారులకు సహకరించాలి. ఇంటి నిర్మాణం జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– శ్రీనివాసులు, ఎంపీడీవో, మాగనూర్